చూసింది. తన చిన్న బుర్రకి అర్థమైన 'పెరిస్ట్రోయికా' - అంటే పునర్నిర్మాణంట - 'గ్లాస్‌నోస్త్' - అంటే పారదర్శకత, బహిరంగతట - నలుగురికీ అన్ని విషయాలు తెలియాలని ప్రకటించారు. అన్ని సంబంధాలకు పునాది ఆర్థికమే అని నమ్మి నిర్మించిన ఆ మహా మేరువు కూడా విచ్చి కూలిపోయింది. అన్ని సంబంధాలకు మూలం మనిషి మనసే, స్వార్థపంకిలంతో నిండిన చర్యలే అని నిర్వచించడానికి వారికి సాహసం చాలలేదా? భౌతికమే గానీ, ఆధ్యాత్మిక సత్యాలకు అన్వేషణ ఆరంభం కాని అయోమయ ప్రపంచమది. "నేను - అహం" అనే మూలంతో నాటుకున్న ఆ స్వార్థంలోంచే మనిషి ఆలోచన, జీవన సమరం ఆరంభమౌతోందని స్పష్టంగా గ్రహించని ఆ విదేశీయుల చరిత్ర వంక మనం ఎందుకు చూడడం లేదు? పాఠాలు నేర్చుకోవడం లేదు? లోలోపలి జ్ఞానం వెలికి వచ్చి మనకెందుకు అక్కరకు రావడం లేదు?

"నాయనలారా, ఈ గింజలు మనందరివీ, కలిసి తిందాం రండి. దొర వీటికి కాపలాదారు మాత్రమే" అని బాపూ చెప్పిన ధర్మకర్తృత్వ సిద్ధాంతాన్ని శ్యామలమ్మ తన భాషలో చెప్పింది. చదువులు, ఆర్థిక సిద్ధాంతాలు తెలియని ఆమె, ఉదారంగా, శాంతంగా, వివేకంతో, తనలో స్వచ్ఛంగా వెల్లుబికిన ప్రేమతో చెప్పింది. వాళ్ళకి ఆ బాష అర్థమైంది. ఆ ప్రేమ తీపి రుచి తెలిసింది. అందుకు ఆ సంసారాన్ని ఊచకోత వేయక, విడిచి పెట్టారు. కానీ, అది తాత్కాలికం. శాశ్వత పరిష్కారం వేరే ఉండి ఉంటుంది.

పక్షులు అందాల అడవి చెట్ల మధ్య, తల ఎత్తిన శిఖరం లాంటి ఇంటి కప్పుమీద నిర్భయంగా గూళ్ళు కట్టుకున్నాయి. ఇంటి ముంగిట దీపాలు వెలిగి, గ్రామంలో తేజస్సు, కళ నింపటం లేదు. పాడుపడి బూజులు వేలాడే ఇల్లు, బీడు పడిన భూములు, చెదరిపోయిన పశువులు, మూసుకున్న కళ్ళల్లో కూడా కనుపాపల్లోనే ఆకలి. కళ్ళు తెరిస్తే ఆ ఆకలి చూపులు ఎక్కడ నిలపాలో తెలియని పసిపిల్లలు, చిన్న కూనలు, ఆధారం లేని ఆడువారు.

ఆ అన్నల దౌర్జన్యం సాధించింది ఏమిటి? అదే ఘన విజయమా? వారిని కన్న తల్లితండ్రులకు కూడా బిడ్డ ఎప్పుడు వస్తాడో తెలియదు. నెత్తురు ముద్దగా పట్టుకొచ్చి పడేస్తారో. ఏ బొందలోకైనా ఆ కట్టెను తోసి ఇంత మట్టి వేశామని చెబుతారో తెలియక అలమటిస్తున్నారు. బక్కచిక్కిన, ఓపిక లేని చేతులతో కానరాని దైవానికి మొక్కుతున్నారు.

ఎన్‌కౌంటర్లు జరిపిన పోలీసుల కథా ఇదే. అధికారంతో బలిసిన ప్రభువులు మాత్రం ప్రతి పూటా శాంతివచనాలు వల్లిస్తున్నారు.

ఇది ప్రగతి కాదు. ఇది మానవాభ్యుదయం కాదు. అమ్మమ్మలాంటి వారు చల్లని హిమం లాంటి, కౌముదీ కిరణాల స్మిత కాంతులతో లోకాన్ని నింపాలి. ప్రతి తల్లి చిలకరించిన క్షీరధారలతో ప్రతి ఒక్కరూ ప్రక్షాళనమై పునీతులు కావాలి.


చిత్రవర్ణమయ లోకంలో, యంత్రాల, చక్రాల, ఆకాశ హర్మ్యాల విద్యుత్తేజవిరాజిత పరిసరాలలో ఉన్న జయ మనసు తీరని కోరికలను కోరు తుంటుంది. తన దేశంలో తానేమీ చేయలేని నిస్సహాయతకు సంజాయిషీ ఇవ్వలేక, భూగోళంలో పవిత్ర భారతదేశం ఉన్న దిశగా చూస్తుంటుంది. ఉపనిషత్తులలో ఉపదేష్టమైన శాంతి మంత్రము "ఓం భద్రం కర్ణేభిః శ్రుణు యామ దేవాః" అని- 'జ్ఞాన ప్రకాశ యుక్తులమై శుభమైన దానినే చెవులతో విందుముగాక' అని చేతులు జోడించి నమస్కరిస్తూ ఉంటుంది. (సమాప్తం)

# స్త్రీ సమస్యల సర్వస్వం

## ఆర్థికవేత్త అమర్త్య సేన్ సూత్రీకరణల ఆధారంగా అనుశీలన

■ మల్లంపల్లి ధూర్జటి

ప్రపంచ జనాభాలో సగానికి మించే స్త్రీలున్నారు. ప్రపంచంలో జరిగే పనిలో మూడింట రెండు వంతులను వీరే చేస్తున్నారు. కానీ, ఆదాయంలో వీరికి పదవ వంతు మాత్రమే లభిస్తోంది. ప్రపంచ ఆస్తిలో వీరికున్నది నూరింట ఒక్క పాలు మాత్రమే. ప్రతి దేశంలోనూ అభివృద్ధి చెందినది, అభివృద్ధి చెందుతున్నది అన్న తేడా లేకుండా పురుషుల కంటే స్త్రీలే ఎక్కువ కాలం పనిచేస్తున్నట్లు ఐక్యరాజ్య సమితికి చెందిన నిపుణులు నిరూపించారు. అయినా, మహిళలకు రావలసినంత గుర్తింపు రావడం లేదు. గుర్తింపు సంగతి దేవుడెరుగు. వారు రకరకాల అసమానతలను ఎదుర్కొంటున్నారు. వారుంటున్న ప్రాంతాన్ని బట్టి ఆయా అసమానతలలోనూ, పరిమాణంలోనూ తేడాలుంటున్నాయంతే. భారత దేశంలోనే కాదు, ప్రపంచ దేశాలలో మహిళల స్థితి గతులకు అద్దం పడుతూ, వారి సమస్యల పరిష్కారానికి తగిన సూచనలు, సలహాలిస్తూ కె.ఎస్. రెడ్డి తేట తెలుగులో రాసిన ఇరవై వ్యాసాల సంకలనమే ఈ స్త్రీ-పురుష అసమానతా సమస్యలు పుస్తకం. ఈ వ్యాసాలు ఆషామాషీగా రాసినవి




స్త్రీ-పురుష అసమానతా సమస్యలు
రచన: కె.ఎస్. రెడ్డి
ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్, స్ట్రీట్ నం. 1 అశోక్ నగర్, హైదరాబాద్-20.
వెల: రూ. 250/-

> **పుస్తకాంశం**
>
> **సమాజమంతా స్త్రీ హింసను సమర్థిస్తున్నప్పుడు, "ఇది నేరం" అని మన చట్టాలు, కోర్టులు అనటానికి సాహసించవు.** -పుట: 345

కావు. ఆయన కేవలం స్టేట్‌మెంట్స్ ఇచ్చి ఊరుకోలేదు. వాటిని బలపరిచే సాధికారికమైన గణాంక వివరాలను అందించారు. ఎంతో శ్రమకోర్చి దేశ, విదేశాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఆయన వీటిని రాశారు. ఆయన ఈ వ్యాసాల రచనలో నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్ రాసిన వ్యాసాలను, పరిశోధనా పత్రాలను, పుస్తకాలను ఉపయోగించుకున్నారు. అమర్త్య సేన్ ప్రతిపాదించిన సూత్రీకరణలను మార్గదర్శకంగా పెట్టుకొని ఆయన స్త్రీ-పురుష అసమానతా సమస్యలను అనుశీలించారు. వ్యాస రచనకు వాటిని ఆలంబనగా చేసుకున్నారు. పురుషాధిక్యతా భావం వల్ల తాము ఎలా నష్టపడుతున్నదీ పురుషులకు కూడా తెలియజెప్పే ప్రయత్నం చేశారు. ఏ సమాజంలోనూ అది ఎంతటి అభివృద్ధిని సాధించినదయినా, పురుషునితో సమానమైన స్థానం స్త్రీకి లభిస్తుండకపోవడం, కుటుంబ వనరులను పురుషునితో సమానంగా వాడుకునే అవకాశాలు స్త్రీకి ఉండకపోవడం స్త్రీ అనుభవించవలసి వస్తున్న బాధలకు మూలమని ప్రొఫెసర్ సేన్ ప్రతిపాదించారు. ఈ రెండింటిలో మొదటి దానిని "అసమానత"గా, రెండవ దానిని "రిక్తపరచటం"గా ఆయన అభివర్ణించారు.

ఈ రెండూ మిగిలిన దేశాలలో కన్నా భారతదేశంలో కాస్త ఎక్కువగానే ఉన్నాయనిపిస్తుంది. ప్రపంచంలో ప్రసూతికి సంబంధించిన మరణాలు అధికంగా ఉంటున్న దేశాలలో మనదీ ఒకటి. దక్షిణ భారతంలో కంటే ఉత్తర భారతంలో ఈ రకమైన మరణాలు ఇంకా ఎక్కువ. ఇక వరకట్నం వంటి దురాచాల వల్ల కడుపు తీపిని కూడా మరచి ఆడపిల్ల పుట్టటాన్ని శాపంగా భావించడం ఎక్కువైంది. ఆధునిక వైద్య విజ్ఞానం ద్వారా పుట్టబోయేది ఆడపిల్లా, మగ పిల్లాడా ముందే తెలుసుకుని ఆడ పిల్ల అయితే, గర్భంలో ఉండగానే హతమార్చే దారుణానికి కూడా ఒడిగట్టడం ఎక్కువైంది. ఇలా తల్లితండ్రులు ఆడపిల్ల పుట్టుకమీదే విరక్తులవుతున్నారు. తమకూ మగ పిల్లలే ఉంటే ఎంత బాగుండేది అనే భావనలో పడుతున్నారు. మగ పిల్లలకు చనుబాలు ఇచ్చినంత ఎక్కువ కాలం ఆడపిల్లకివ్వడం లేదు. ఆడ పిల్లలను త్వరగా తల్లి పాలు మానిపిస్తున్నారు. స్త్రీలలో అత్యధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులు. పిల్లలను చదివించడానికి ఈ రోజుల్లో చాలా డబ్బు ఖర్చవుతోంది. ముఖ్యంగా పేదలకు ఇది భారమవుతోంది. పేదలకు ఆడ పిల్లలు కూడా పనిచేస్తేనేగాని ఇల్లు గడవదు. వారికి పిల్లలను బడికి పంపడం కంటే, పనికి పంపడమే లాభంగా కనిపిస్తుంది. వోటర్లలో సగ భాగంగా ఉన్న మహిళలకు రాజకీయ రంగంలో నిర్ణయాత్మక స్థానం ఎందుకు లభించడం లేదనేది ఇంకా అగమ్యగోచరంగానే ఉంది. విచిత్రం ఏమిటంటే, మహిళలు వోటు హక్కును కూడా పోరాడి సాధించుకోవలసి వచ్చింది. అన్ని దేశాలలోనూ కలిపిచూస్తే మహిళలు సగటున 39 ఏళ్ళుగా వోటింగ్ హక్కును అనుభవిస్తున్నట్లు లెక్క తేలుతుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఐరోపా దేశాల మహిళలు సగటున 56 ఏళ్ళ నుంచీ, ఆసియా, ఆఫ్రికా, కరిబియన్ ప్రాంతాల మహిళలు 37 ఏళ్ళ నుంచి వోటు హక్కును అనుభవిస్తున్నారు. ప్రపంచంలో మహిళలు అనుభవిస్తున్న హింసలో అత్యధిక భాగం సెక్సుపరమైనదే. ఏ దేశమైనా తన పౌరులందరి సృజనాత్మక శక్తులను వినియోగించుకోగలిగినప్పుడే పురోగమించగలుగుతుంది. మాతృ మూర్తులుగా, శిశు సంరక్షకులుగా మహిళలు సమాజానికి చేస్తున్న సేవలు, అత్యున్నతమైనవి. అయినా, వారి ప్రాముఖ్యతను సమాజం తరచూ మరచిపోతోంది. వేతనార్జనకు వెళుతూ జాతీయ సంపదోత్పత్తికి సగ భాగాన్ని సమకూరుస్తున్న మహిళను అలక్ష్యం చేయడం తగని పని.

స్త్రీ-పురుష అసమానత్వం కేవలం చట్టాల వల్ల పోయేది కాదని వెల్లడవుతూనే ఉంది. మానవ దృక్పథంలోనే మార్పు రావాలి. అందుకు, ఈ పుస్తకం బాగా దోహదపడుతుంది. ■